

శ్రీవారి సేవలో కీర్తి సురేష్



ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో ప్రముఖ సినీనటి కీర్తి సురేష్ దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయక మండపంలో టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల కీర్తి సురేష్ మీడియాతో మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో బోలా శంకరుడు సినిమా రిలీజ్ ఉంటుందన్నారు.

నీరు.. నీడ.. ఏదీ..?



కరువు పనుల్లో కూలీల కష్టాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఒక పూట కూటి కోసం నిరుపేద కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. అయితే ఉపాధి కూలీలకు కనీస వసతులైన నీరు.. నీడ..కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎండలు మండతున్న నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు టెంట్లు వేసి నీడను కల్పించాలి. అలాగే తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను అందించాలి. అయితే ఇవేవీ కూలీలకు అందడం లేదు. అంతేకాకుండా పనులు జరుగుతున్న సమయంలో చిన్నిచిన్న గాయాలైతే కూలీలకు ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్‌ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి, కానీ కూలీలకు గాయాలై రక్తం కారుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రాథమిక చికిత్స కిట్లు లేవు. దీనికి తోడు పనులు చేయడానికి పదునుగా ఉండాల్సిన పనిముట్లు మొద్దుభారి ఉండటంతో కూలీలు వాటితోనే కుస్తీలు పడుతున్నారు.

ఉపాధి హామీ చట్టం వలసలను నివారించి పేదలకు పని కల్పించడమే ముఖ్యఉదేశ్యంతో యుపిఏ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమ్యూనిస్టుల పోరాటం ఫలితంగా పొట్టకూటి కోసం అల్లాడుతూ పనుల కోసం వలసలు వెళ్ళే వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించేలా జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి కల్పించేలా ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గతంలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు వేసవి కాలంలో మజ్జిగ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, కూలీల భోజనం, సేద తీరెందుకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేలా కూలీలకు కల్పించే కనీస సౌకర్యాల్లో కోతలు విధించింది. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలకు కూలి మినహా ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. మండుటెండల్లో మలమలాడుతూ కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. అయినా రోజుకు రూ.230లు మించి కూలి రావడం లేదు.

జిల్లాలో 2,51,981 కుటుంబాలు ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. వీరందరికీ పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందులో రెండు లక్షల మంది వారికి సమీప ప్రాంతాల్లో ఉపాధి పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న వారిలో దళితులే అధికంగా ఉన్నారు. రోజువారి రూ.200లు మించి కూలి రాకపోవడం, వేసవిలో చేతులు బొబ్బలెక్కేలా పనులు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. మరోవైపు ఉపాధి హామీ పథకానికి మంజూరు చేయల్సిన నిధుల్లో కోత విధించడం చూస్తే ఉద్దేశ్యపూర్వకంగా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు తేటతెల్లం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆకలి తీరుస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోజుకు రూ.200లే..

- అమల, వృద్ధురాలు, చిత్తూరు రూరల్ మండలం, అప్పయ్యగారి పల్లె

ఉదయం నుంచి మధ్యాహ్న వరకు సప్లైయ్ ఛానల్ మట్టి తవ్వే పనిచేస్తున్నా రూ.200లు మించి రావడం లేదు. పని ప్రదేశంలో నీళ్ళు లేవు. వ్యవసాయ బావుల నుండీ తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇంట్లో జరగక ఉపాధి పనిచేసేందుకు వస్తున్నాను. తాగునీరు, భోజనాలు చేసే సమయంలో నీడ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నేను గత రెండు సంవత్సరాలుగా ఉపాధి హామీ పనులు చేసుకుంటున్నాను.

ఎంత పని చేసినా అంతే...

- చిట్టేమ్మ, మహిళా కూలి, అప్పయ్యగారిపల్లె



మా దళితవాడలోని మహిళలు ఉపాధి హామీ పనులు చేస్తున్నాం. ఒక మనిషికి వారానికి రూ.1,300లు వస్తోంది. రోజుకు రూ.230లు చొప్పున బ్యాంకు అకౌంట్‌లో వేస్తున్నారు. కూలి మినహా ఏమీలేదు. పనిచేస్తున్న ప్రదేశంలో నీళ్లులేవు, నీడ లేదు. ఎండలో పనిచేయాల్సి వస్తోంది. తాగునీటి కోసం సమీపంలోని అగ్రకులస్తుల గ్రామం తుమ్మిందపాళ్యం వెళ్లి తెచ్చుకోవాలి. గతంలో పనిప్రదేశంలో నీరు, ఎండాకాలంలో మజ్జిగ ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అవేవీ లేవు.



వేసవిలో కూలి పెంచాలి

- కాంచనా, ఉపాధి కూలి

ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు కూలి పెంచాలి. మా దళిత వాడలోని మహిళలతో కలిసి ఉపాధి పనులు చేస్తున్నాం. రోజుకు రూ.200లకు మించి రావడం లేదు. పనిముట్లు ఇంట్లో నుంచి తెచ్చుకుంటున్నాం. మా దళితవాడలోని మగవాళ్లు కూడా ఉపాధి పనులు చేస్తున్నారు. భార్యభర్త ఇద్దరూ పనిచేసేనా రోజుకు రూ.400లు మించి రావడం లేదు. ఏది ఏమైనా మాకు ఉపాధి పనులు అన్నం పెడుతున్నాయి. ఈపని లేకుంటే పస్తులు ఉండాల్సిందే.. వారానికోసారి వచ్చే డబ్బులతో మూడు పూటలా అన్నం తింటున్నాం.

పేదల పథకాన్ని నిలబెట్టుకుందాం..

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గంగరాజు

పేదల కోసం యుపిఎ ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా అప్పటి ప్రభుత్వం మహాత్మ జాతీయ గ్రామీణ చట్టంను అమల్లోకి తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో పొట్టకూటి కోసం అల్లాడుతున్న ప్రజలకు ఎంతో అండగా ఉన్న ఈపథకాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తోంది. బడ్జెట్‌లో కోత, పనిప్రదేశాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. పేదలకు కాస్తో కూస్తో అండగా ఉన్న మహాత్మ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న పథకాన్ని నిలబెట్టుకోవడం కోసం అలుపెరగని పోరాటాలకు కూలీలను సిద్ధం చేస్తాం. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేద్దాం.



ప్రభుత్వ విధానం అమలు చేస్తున్నాం

- గంగా భవాని, డ్వామా పీడీ చిత్తూరు



జాబ్ కార్డులున్న వారందరికీ పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. బడ్జెట్‌లో మౌలిక వసతులు కల్పించలేకపోతున్నాం. వేసవి కాలంలో ఉదయం, సాయంత్రం పనులు చేస్తున్నారు. వేసవి అలెవెన్సు ఇవాల్సి ఉంది. జాబ్‌కార్డులు పొందిన వారు అధిక శాతంలో ఉన్నా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు.

రేపు జిఎస్ఎల్‌వి -ఎఫ్12

రాకెట్ ప్రయోగం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం 10.42 గంటలకు జిఎస్ఎల్‌వి -ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేసింది. ఈ రాకెట్ ద్వారా ఎన్‌విఎస్ -01 నేవిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుంది. 2,232 కిలోల బరువు ఉండే ఎన్‌విఎస్ -01 నేవిగేషన్ ఉపగ్రహాన్ని భూధృవ కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్‌లలో వాడుతున్న జిపిఎస్ తరహాలో నేవిగేషన్ ఉపగ్రహం సేవలు అందిస్తుంది. దీంతోపాటుగా భూగోళ, సముద్ర మార్గాలలో దారి చూపడానికి వైమానిక ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. వ్యవసాయ రంగానికి, విమానాల సర్వీసులకు, అత్యవసర ప్రయోజనాలకు సముద్రంలో మత్స్యసంపదను గుర్తించడానికి, వివిధ ప్రభుత్వ శాఖల ప్రయోజనాల కోసం ఈ ఉపగ్రహాన్ని ఉపయోగించనున్నారు. రాకెట్ ప్రయోగం జరిగిన అనంతరం 18 నిమిషాల నుండి 19 నిమిషాల మధ్య సమయంలో ఎన్‌విఎస్ -01 ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యకు చేర్చడం జరుగుతుంది. ఈ ఉపగ్రహం 12 సంవత్సరాల పాటు సేవలు అందించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించి ఉన్నారు. గతంలో ప్రయోగించి ఉన్న నేవిగేషన్ ఉపగ్రహాలకన్నా అత్యంత అధునాతన సాంకేతిక పరికరాలను ఈ ఉపగ్రహంలో పొందుపరిచారు.

చెంగాలమ్మ సేవలో ఇస్రో ఛైర్మన్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సోమవారం శ్రీహరికోట నుండి జి ఎస్ ఎల్ వి -ఎఫ్12 రాకెట్ ప్రయోగం ద్వారా ప్రయోగించే ఎన్ వి ఎస్ -01 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శనివారం పూజలు చేశారు. ముందుగా ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పరివార దేవతలను దర్శించుకున్నారు. అనంతరం అమ్మణ్ణిని దర్శించి పూజలు చేసి హారతులు అందుకున్నారు. అనంతరం ఇస్రో ఛైర్మన్‌కు ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి, కార్యనిర్వాహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి ఆలయ మర్యాదలు అందజేశారు. ఈ సందర్భముగా ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ జి ఎస్ ఎల్ వి -ఎఫ్12 ద్వారా ఎన్ వి ఎస్ -01 నావిగేషన్ శాటిలైట్ ప్రయోగానికి సన్నాహాలు సాఫీగా సాగుతున్నాయని, ప్రస్తుతం అంతరిక్షం నుండి సేవలు అందిస్తున్న 8 ఐ ఆర్ ఎన్ ఎస్ ఎస్ ఉపగ్రహాలలో నాలుగు ఉపగ్రహాలకు కాలం చెల్లిందని, వాటి స్థానం భర్తీ చేయడం కోసం ప్రతి ఆరు నెలలకు ఒక నావిగేషన్ ఉపగ్రహం ప్రయోగించనున్నట్లు తెలిపారు. చంద్రయాన్ -3 జులైలో ఉంటుందని తెలిపారు. సోమవారం ప్రయోగించే ఉపగ్రహానికి కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం 6.30 ప్రారంభం కానుంది. ఛైర్మన్ వెంట షార్ గ్రూప్ మేనేజర్ గోపికృష్ణకాలయ పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కర్లపూడి సురేష్, నేతలు కళత్తూరు శేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బండి రాజేష్ పాల్గొన్నారు.



చెంగాలమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఇస్రో ఛైర్మన్

29న జాతీయ కమిషన్ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 29న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ ఛైర్మన్ ఎం.వెంకటేషన్ జిల్లాలో పర్యటించనున్నారని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు పట్టణంలోని సఫాయి కర్మచారి కాలనీని పరిశీలిస్తారు. అనంతరం 3 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పీలతో కలిసి మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, డివిఎంసి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఛీఫ్ టెర్మినల్ మేనేజర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, యూనియన్ లీడర్స్, అసోసియేషన్స్ సభ్యులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్స్, సఫాయి కర్మచారి వారిని కలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 6 గంటలకు చిత్తూరు నుంచి బయలుదేరి తమిళనాడుకు వెళ్ళతారని తెలిపారు.

అనధికారిక వ్యక్తుల ఏరివేతకు రంగం సిద్ధం

తిరుమలలో భద్రత పెంపునకు టీటీడీ చర్యలు

స్థానికులతో సమావేశంలో అధికారుల వెల్లడి




సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి అధికారులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో అనధికారిక వ్యక్తుల ఏరివేతకు టీటీడీ రంగం సిద్ధం చేసింది. తిరుమలలో హోటలర్లకు కేటాయించిన 24 కాటేజీలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ ప్రకటించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆదేశాల మేరకు శనివారం తిరుమలలోని స్థానికులతో భద్రతా చర్యలపై తిరుమల రెవెన్యూ కార్యాలయంలో టీటీడీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ స్థానికులు, దుకాణదారులతో మాట్లాడుతూ తిరుమలలో భక్తులకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హోటళ్లకు కేటాయించిన 24కాటేజీలను మూడు రోజుల్లో ఖాళీ చేయాలనీ, ప్రత్యామ్నాయ వసతి కల్పించబడదని చెప్పారు. ప్రతినెలా విధిగా 5వ తేదీలోపు దుకాణాల లైసెన్స్ రుసుంను చెల్లించాలని ఆదేశించారు. దుకాణాల్లో పనిచేసే వర్కర్ల డేటాతో పాటు పోలీస్ కేసులు లేకుండా సర్టిఫికేట్ ఉంచుకోవాలని కోరారు. ప్రతి దుకాణంలో వ్యాపారం చేసుకునే వస్తువులకు ప్లాస్టిక్ కవర్లు లేకుండా చూసుకోవాలన్నారు. హోటల్స్, టీదుకాణాల్లో ధరల పట్టిక కనపడేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమల నిబంధనలు ప్రకారం దుకాణాల్లో నిషేధిత వస్తువులు కలిగి ఉండకూడదని, ఎవరైనా నిషేధిత వస్తువులు కలిగి ఉంటే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో పరిమితికి మించి ఆక్రమణలు చేస్తే తొలగిస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న వ్యక్తులను పలు గ్రూపులుగా విభజించి బాలాజీనగర్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్‌లో శుద్ధ తిరుమల సుందర తిరుమల కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్టేట్ ఆఫీసర్ తెలియజేశారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ, టాస్క్‌ఫోర్స్ ఏఈఓలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, లీజు హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వాలంటీర్లు

డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామి



సిఎం చిత్రపటానికి వాలంటీర్లతో కలిసి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలాంటి వారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థలో వాలంటీర్లు చాలా బలమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వాలంటీర్లు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రజాసమస్యలను పరిష్కరించి ప్రభుత్వ లబ్ధిని నేరుగా వారి అకౌంట్‌లోకి చేరవేయడంలో వాలంటీరుల క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వాలంటీర్లను సేవారత్న, సేవావజ్రం, సేవామిత్ర అవార్డులతో సన్మానించడం సంతోషదాయకమని అన్నారు. ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, ఎంపీడీఓ శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాథన్, నేతలు గుణశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, బలరామి రెడ్డి, చిట్టిబాబు మొదలి, లోకనాథ్ యాదవ్, ఏకాంబరం, రవీంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామవాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కషి చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె, వైఎస్సార్సీపీ నాయకురాలు కె.కపాలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాలంటీర్లకు వందన కార్యక్రమాన్ని ఎంపీపీ లతబాలాజీ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వాలంటీర్లకు సేవా, సేవావజ్ర, సేవామిత్ర అవార్డులతో పాటు మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, వైస్‌ఎంపీపీ మణెమ్మ, మండల కోఆప్షన్ మెంబర్ మణిమ్మ, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గోపి, ఎఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, పురంధర్, ఎంపీడీఓ మోహన్ పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న వాలంటీర్లతో కృపాలక్ష్మి

అధైర్య పడొద్దు.. మేమున్నాం..

గాయపడిన కార్మికులతో కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పారిశుధ్య పనుల నిర్వహణలో ఉండగా కారు ఢీకొనడంతో గాయపడిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పరామర్శించి ధైర్యం చెప్పారు. నగరపాలకకు చెందిన పారిశుధ్య కార్మికులు ప్రవీణ్‌కుమార్, ఆదిలక్ష్మిలు వరిగపల్లి వద్ద శనివారం సాయంత్రం పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటీనా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే నగర కమిషనర్ అరుణ ఆస్పత్రికి చేరుకొని కార్మికులను పరిశీలించారు. అంబులెన్స్‌లోకి వెళ్లి ప్రవీణ్ కుమార్, ఆదిలక్ష్మి లతో మాట్లాడారు. ఏమీ కాదని మెరుగైన వైద్యం అందిస్తామని ధైర్యం చెప్పారు. పారిశుధ్య కార్మికులను సిఎంసి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని ఎంహెచ్‌ఓ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్యలను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ, శానిటరీ ఇన్స్పెక్టర్ బాధితులతో పాటు సీఎంసీ ఆసుపత్రికి వెళ్లి చేర్పించారు. వైద్యులతో మాట్లాడి మెరుగని చికిత్స అందించాలని కోరారు.



గాయపడ్డ కార్మికులను పరామర్శిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాదృష్టి

మరో పోరుకు సిద్ధమైన వీవోఏలు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యలకు నిరసనగా జిల్లాలో 31మండలాల్లో ఉన్న 1300 మంది వీవోఏల ఉపాధికి ఎసరు పెట్టింది. ఉపాధి కాపాడుకోవడానికి జిల్లాలోని అందరూ మారోమారు పోరుబాట పట్టారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 64 సర్క్యులర్‌ను రద్దు చేయాలని గత పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటిని ఉమ్మడి జిల్లాలో ఉన్న వీవోఏలందరూ భారీ ఎత్తున ముట్టడించడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం దొడ్డిదారిన మళ్లీ 64 సర్క్యులర్‌ను అమలు చేయడానికి సిద్ధమవుతోంది.

ప్రస్తుతం జిల్లాల విభజన అయిన తర్వాత చిత్తూరు జిల్లాలో ఉన్న వీవోఏలు పోరుబాట పట్టారు. ఒక్కొక్క వీవోఏ 15 సంఘాల నుంచి 70 సంఘాల వరకు ఆయా పంచాయతీల జనాభా పరిధిలో ఉన్న సంఖ్యను బట్టి పనిచేస్తున్నారు. అయితే గతంలో ఎక్కువ సంఘాలున్న వీవోఏ పనికష్టంగా ఉంటుందని సంఘాలను విభజన చేసి, ఆ సంఘాలకు అదనంగా వీవోఏలను నియమించారు. ఆ విధంగా పని కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం ఉన్నవారిని తొలగించడానికి కొత్త ఎత్తుగడలు తీసుకువస్తూ మొదట 15 సంఘాలున్న వాటిని మెర్జ్ చేసి ఆ సంఘాల వీవోఏను తొలగించాలని ప్రయత్నం చేసింది. దాన్ని కొనసాగింపుగానే ప్రస్తుతం 30 సంఘాలలోపు ఉన్నవారిని తొలగించడానికి ఆ సంఘాల మెర్జింగ్ చేయమని ఆదేశాలిస్తున్నది. ఈ అనాలోచిత చర్యల వలన వీవోఏలు విసిగిపోయి పోరాటాలకు సిద్ధమయ్యారు. జిల్లా అధికారులకు ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చారు. అలాగే 28,29 తేదీల్లో మండలస్థాయిలో వినతిపత్రాలు ఇవ్వనున్నారు. వారు చేస్తున్న న్యాయమైన డిమాండ్లు 64 సర్క్యులర్‌లో ఉన్న మూడు సంవత్సరాల కాలపరిమితిని వెంటనే రద్దు చేయాలని, జెండర్ విధానాన్ని రద్దు చేయాలని, చదువుతో నిమిత్తం లేకుండా ఉన్న వారిని కొనసాగించాలని, వీవోఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీవోఏలు (ఫైల్‌ఫొటో)

పక్కనున్న తెలుగు రాష్ట్రమైన తెలంగాణా రాష్ట్రంలో వీవోఏలందరిన్నీ పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఇక్కడ మాత్రం తొలగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో చిత్తూరు జిల్లాలో చేసిన పోరాటాల ఫలితంగా వెనక్కు తగ్గిన ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని, అదే స్థాయిలో జిల్లాలో పోరాటాలకు సిద్ధమవుతున్నామని వీవోఏలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీవోఏల సమస్యలను పరిష్కరించాలి, లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

- వీజీఆర్

విలువలతోనే వ్యక్తిత్వ వికాసం



ప్రజాశక్తి-పలమనేరు: చిన్నతనం నుంచే విలువలు నేర్చుకుని ఆచరించడంతో వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాధం నాయుడు అన్నారు. శనివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో సొంత కళామందిరంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు అన్నిరకాల కళలను పరిచయం చేయాలని, తద్వారా వారు ఉల్లాసంగా చదువుపై ఆసక్తి కనబరుస్తారన్నారు. నీతికథలు, నీతి సంభాషణల ద్వారా నీతి పద్యాలు, ఆటలు, సూక్తులతో ఎటువంటి పిల్లల్లో అయినా వ్యక్తిత్వ వికాసం తీసుకురావచ్చన్నారు. మాతృభాషలోని పుస్తకాలు చదవడంతో విషయ అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం పిల్లలు తాము నేర్చుకున్న కథలు, పద్యాలు, పాటలను పాడి వినిపించారు. పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ తరగతుల వల్ల మా పిల్లల్లో నూతనోత్తేజం కలిగిందని నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న పిల్లలందరికీ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, శివశంకర్ రెడ్డి, సుదర్శచారి, గురుమార్తి, శ్రీపురం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను నమోదుచేయాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాతా శిశు మరణాలను నమోదు చేయాలని సిగ్మా ఏజెన్సీ జిల్లా కోఆర్డినేటర్ గోవిందయ్య అన్నారు. శనివారం మండలంలోని నూనె గుండ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామాల్లో జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే 6వ విడత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, మాతా శిశు సంరక్షణ, పోషణ, రక్తహీనత, కుటుంబ నియంత్రణ సేవలు, వ్యాధి నిరోధక టీకాల వివరాలను నమోదు చేయాలని, గ్రామాల్లోని పరిసరాల పరిశుభ్రంపై సమాచారాన్ని సేకరించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థకు అందజేస్తామని సంస్థ ద్వారా మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పంపిస్తారని, దీనివల్ల గ్రామాల్లో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేయాలనేదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. అనంతరం సర్వే చేపట్టారు. కార్యక్రమంలో మోహన్, ఎంఎల్‌హెచ్‌పి ఉష, ఆరోగ్య కార్యకర్త జాంబవతి, ఆశా వర్కర్ మల్లిక పాల్గొన్నారు.

వేసవి కూలి ఇచ్చి ఆదుకోవాలి




ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వేసవి అదనపు కూలి ఇచ్చి ఆదుకోవాలని ఉపాధి కూలీలు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 41 పంచాయతీల్లో 45 పనులు చేపడుతున్నారన్నారు. ప్రస్తుతం కాలువ, చెరువుల్లో, పూడిక తీత కుంటల నిర్మాణాల్లో పనులు చేపడుతున్న కూలీలకు వేసవి అదనపు కూలి మంజూరు చేయడం, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీని రక్షించి పేదవాళ్ల పక్షంలో నిలవాలన్నారు.

బహిరంగ ప్రదేశాలలో సిగరెట్ తాగితే చర్యలు



ప్రజాశక్తి-రొంపిచెర్ల: చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలో సిగరెట్ తాగితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రొంపిచెర్ల ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో సిగరెట్ తాగుతున్న వ్యక్తులకు రూ. 200 లు జరిమానా విధించారు. దీనిని దష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలు బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయరాదని ఎస్సై శ్రీనివాస్ తెలియజేశారు.

మహానాడులో పాల్గొన్న టిడిపి నేతలు



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాజమహేంద్రవరంలో జరిగే మహానాడు కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శనివారం పాల్గొన్నారు. పార్లమెంటు కార్యనిర్వహణ కార్యదర్శి కష్ణమ నాయుడు, యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, పాలసముద్రం మండల పార్టీ అధ్యక్షులు రాజేంద్రన్, చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి రెడ్డప్ప, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయ యాదవ్, రైతు నాయకులు నాగేశ్వరరావు రాజు పాల్గొన్నారు.

వైభవంగా పొన్నెమ్మ తిరునాళ్లు



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని కలిజవేడు పంచాయతీకి చెందిన బొమ్మ వారి పల్లెలో వెలిసిన శ్రీ పొన్నెమ్మ దేవస్థానంలో అమ్మవారి తిరునాళ్లుఅంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి అమ్మ వారికి పొంగళ్ళు పెట్టి ప్రత్యేక అభిషేకం నిర్వహించి అమ్మ వారిని ప్రత్యేక పుష్ప పల్లకిలో గ్రామ వీధుల్లో బ్యాండ్ బాజాలు, బాణాసంచా వేడుకల మధ్య ఊరేగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాడుతాం

ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆపే ప్రసక్తేలేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శివయ్య ఉద్ఘాటించారు. అందులో భాగంగా శనివారం రాష్ట్ర సంఘం పిలుపుమేరకు పలమనేరు తహశీల్దార్ కార్యాలయం ముందు తాలూకా అధ్యక్షులు జయశంకర్ అధ్యక్షతన రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగస్తులకు మంచి అవకాశాలు కల్పిస్తామని, మాట చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఉద్యోగస్తుల ఊసే ఎత్తలేదని విమర్శించారు. పలమనేరు తాలూకా అధ్యక్షులు జయశంకర్ మాట్లాడుతూ ఉద్యోగస్తులకు జీతాల విషయంలో ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను సత్వరమే రెగ్యులర్ చేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి రావాలని డిమాండ్



చేశారు. తాలూకా ఉపాధ్యక్షులు విద్యా సాగర్ రెడ్డి మాట్లాడుతూ 11వ పిఆర్సి బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని, పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రశాంతంగా విధులు నిర్వహించుకుంటున్న ఉద్యోగులను ఇలా రోడ్లపైకి లాగడం ప్రభుత్వానికి కాలం చెల్లినట్లేనని జోష్యం చెప్పారు. తాలూకా కార్యదర్శి మాట్లాడుతూ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు అందాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో చెల్లించాలని, ఉద్యోగుల సమస్యలకు రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం స్పందించక, నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బంగారు పాళ్యం తాలూకా కార్యదర్శి సురేంద్ర నాథ్ రెడ్డి, పలమనేరు తాలూకా రమణ, పలమనేరు తాలూకా నాయకులు నజీర్, జ్యోతిష్వర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా పోరాటం

ప్రజాశక్తి-పుంగనూరు: నియోజకవర్గంలోని సోమల మండలం ఆవులపల్లి, పుంగనూరు మండలం నేతిగుట్లపల్లి, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు ప్రాజెక్టులను శనివారం రాష్ట్ర యువ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త బోడె రామచంద్రయాదవ్ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించి ముంపు గ్రామాల ప్రజలు, నిర్వాసిత రైతులకు న్యాయం జరిగేలా కషి చేస్తానని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలు, ముంపు ప్రాంతాల్లో రైతులు కోల్పోయిన వ్యవసాయ పంటలు, వక్షాలు, దెబ్బతిన్న పర్యావరణం, ముంపు గ్రామాలను పరిశీలించడం జరిగిందని చెప్పారు. ఇప్పటికైనా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించి ప్రాజెక్టుల ముంపు నిర్వాసిత రైతులు, ప్రజలకు వెంటనే నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టుల కారణంగా నష్టపోయిన రైతులు, ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది అన్నారు. రోడ్డు మార్గాన వెళితే పోలీసులు అడ్డుపడుతుండగా హెలికాప్టర్ ద్వారా ప్రాజెక్టులన్నీ తిరిగి పరిశీలించినట్లు చెప్పారు. చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో హెలికాప్టర్‌లో ప్రాజెక్టులను ఏరియల్ పరిశీలన చేయడం కూడా నేరమని, పోలీస్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించినప్పటికీ రైతులు, ప్రజల కోసం ఏ మాత్రం వెనకంజ వేయకుండా రైతు నాయకుడిగా రామచంద్ర



యాదవ్ దిగ్విజయంగా ప్రాజెక్టుల పర్యవేక్షణ పూర్తి చేశారు.

నేతిగుట్లపల్లి ప్రాజెక్టు వద్ద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. రైతులు జరిగిన అన్యాయాన్ని, మంత్రి పెద్దిరెడ్డి వారికి చేసిన ద్రోహాన్ని, మంత్రి అనుచరుల దగ్గర ఆడిస్తున్న నాటకాల గురించి, ప్రతి ఒక్కరికి తెలియజేసే బాధ్యత మీడియాపై ఆధారపడి ఉందన్నారు. అందులో భాగంగానే ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజమండ్రిలో జరుగుతున్న మహానాడులో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసేలా చంద్రబాబు ఈ అక్రమ ప్రాజెక్టల గురించి మాట్లాడవలసిందిగా రైతుల తరపున చంద్రబాబు దష్టికి తీసుకెళ్లాలని రైతులు మహానాడులో ఉన్న పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డికి చరవాణిలో తెలిపారు.

ఎస్సైని సస్పెండ్ చేయాలి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్ళపల్లిలో ఓ వ్యక్తి మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని వాట్సప్ గ్రూప్‌లో పత్రికా ప్రతినిధులు పోస్ట్ చేసినందుకు, ఒక వేళ నాటు సారా తాగి మరణించి ఉంటే అతనికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని జనసేన తరపున డిమాండ్ చేసినందుకు, వివరాలు ఇవ్వక పోగా వెదురుకుప్పం మండల ఎస్సై లోకేష్ నాపై, నలుగురు విలేకరుల పైన అక్రమంగా కేసులు బనాయించడాన్ని జనసేన పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ యుగంధర్ పొన్న శనివారం ఖండిం చారు. ఆయన మాటల్లోనే వివరాలు... మృతి చెందిన వ్యక్తి అల్లుడు ఫిర్యాదు ఇచ్చారని తప్పుడు కేసు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఫిర్యాదు దారుడు తాను ఎలాంటి కంప్లైంట్ ఇవ్వలేదని ఎస్పీకి తెలియజేశారు. నకిలీ ఎఫ్ఐఆర్ ఎవరి కోసం సృష్టించారనీ, అలాంటి అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19/1 ఎ ప్రకారం ప్రతి ఒక్కరికీ వాక్ స్వాతంత్రం ఉందనే విషయాన్ని చాటి చెబుతుందనీ తెలియజేశారు. పోలీసులు అధికారులు ఫోర్త్ ఎస్టేట్ను అగౌరవపరిచారనీ వారినెందుకు కేసులో ఇరి కించారనీ ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టు మార్టంలో అనేక అనుమానాలు ఉన్నాయని, ఈ విషయంలో పోలీస్ అధికారులు చూపిన అలసత్వానికి, అప్రజాస్వామిక చర్యలకు, నిరుపేదలను మోసం చేసే విధంగా ప్రయత్నించినందుకు, వెదురుకుప్పం ఎస్సై, సీఐ మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న పత్రికా ప్రతినిధులను ఎందుకు ఇబ్బందిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ మా నాయకులు పవన్‌కళ్యాణ్‌కి మీరంటే గౌరవమనే విషయాన్ని తెలుసుకో వాలని తెలిపారు. ఇప్పటి వరకు మీరు నా మీద ఎన్ని కేసులు పెట్టినా, పత్రికా ప్రతినిధులు లేకుండా మీరు సజావుగా పరి పాలన సాగించగలరా అని ప్రశ్నిం చారు. జిల్లా ఎస్పీ ఈ విషయంలో వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి-శాంతిపురం: ముందస్తు సమాచారం లేకుండా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశాన్ని వాయిదా వేయడంపై దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సచివాలయంలో ఏర్పాటు చేసినట్టు సర్క్యులర్‌ను సంబంధిత నాయకులకు ఇచ్చారు. దీని ప్రకారం 11 గంటలకు సచివాయం చేరుకోగా నేడు మీటింగ్ జరగడంలేదని సోమవారానికి వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు. సమావేశానికి పిలిచి అవమానిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరగవలసిన విజిలెన్స్ మీటింగ్ సమావేశం జరపలేదని ఎమ్మార్పీఎస్, బిఎస్, మాల మహానాడు నాయకులు సెల్ ఫోన్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. కార్యాలయం తలుపులు మూసి ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయం ముందు సుమారు రెండు గంటలసేపు ధర్నా చేశారు. తహశీల్దార్ లోకేశ్వరరావు హుటాహుటిన మధ్యాహ్నం రెండు గంటలకు మండల కార్యాలయంలోని సమావేశంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్‌లో అధికార పార్టీ నాయకుడు అక్రమంగా జెసిబి యంత్రాలతో పనులు చేశారని, పాత గుంతలకు బిల్లులు చేశారని వీటి మీద పిడి విచారణ చేయాలని తెలిపారు. నాడు



నేడు పనుల్లో బిజీగా ఉండి పదవ తరగతి ఉత్తీర్ణత చాలా తగ్గిందని అలాగే పాఠశాల మధ్యాహ్నం భోజనంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని అన్నారు. అలాగే మండలంలోని వివిధ సమస్యల మీద దళిత నాయకులు ఏకరు పెట్టారు. కచ్చితంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం, ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం జరపాలని, అలా జరపని పక్షంలో నిరసనకు పిలుపునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకేశ్వరరావు, ఎంపీడీవో హేమమాలిని, ఎస్సై మునస్వామి, డిప్యూటీ తహశీల్దార్ కౌలేష్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు దేవరాజ్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్ర మాదిగ, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు అందరికీ అందిస్తాం

ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలోని రైతులందరికీ వేరుశనగ విత్తన కాయలు అందిస్తామని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం పుంగనూరు రూరల్ పరిధిలోని బోడేవారి పల్లి గ్రామ పంచాయతీ బోడేవారిపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద అందచేస్తున్న వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అర్హులైన రైతులందరికీ వేరుశనగ కాయలు రాయితీపై అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ కోటగడ్డ అమర్‌నాథ్ రెడ్డి, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకుడు జయరామిరెడ్డి, ఎంపీటీసీ రామకష్ణారెడ్డి, వైసీపీ యువనాయకుడు కొమ్మిరి రమణ, సర్పంచ్ సుధా తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని 18 రైతు భరోసా కేంద్రాలకుగాను శనివారం వరకు 12 క్వింటాల 90 కేజీలు మండలానికి చేరినట్టు, ఇంకనూ పిసిగుంట, గొల్లచీమలపల్లి, ఆలపల్లి, కంభంపల్లి, కడపనాతం, వెంగంవారిపల్లి రైతు భరోసా కేంద్రాలకు వేరుశనగ విత్తనాలు అందాల్సి ఉందని అవి అందిన వెంటనే ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం వారు ప్రకటించిన 30 కేజీల వేరుశనగ బస్తా రూ.1674లతో, అర్హత కలిగిన ప్రతి రైతుకు వేరుశనగ విత్తనాలు అందిస్తామని మండల ఏవో మునికష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బేలుపల్లి ఎంపీటీసీ భాస్కర్ మొదలి రైతు భరోసా కేంద్రానికి చేరుకొని వేరుశనగ విత్తనాలను పరిశీలించి, నాణ్యంగా ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.



కుప్పం: రైతులకు వేరుశనగ విత్తనాలను ఈనెల 29వ తేదీ నుంచి ప్రభుత్వ రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు కుప్పం ఏవో అమతవల్లి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆర్బీకే కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, రూ. 1674 లు ఇచ్చి రైతు పేరు ఆర్బీకే కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



ప్రజాశక్తి-పులిచెర్ల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శిరీష తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పులిచెర్ల ఐసిడిఎస్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి, శిరీష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. ఆహారం, ఆరోగ్యంతోనే మెరుగైన జీవితం సాధ్యమవుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎనలేని కషి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వీల్‌చైర్, మంచం వితరణ



ప్రజాశక్తి-నగరి: స్థానిక ఏరియా ఆస్పత్రికి చంద్రారెడ్డి రూ.15 వేల విలువైన వీల్‌ఛైర్‌ను, శీనురాజ్ రూ.15 వేల ఇనుప మంచాన్ని అందించారు. వీటిని శనివారం మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతికి వారు అందజేశారు. ఆస్పత్రికి సహకారం అందించిన దాతలకు మెడికల్ సూపరింటెండెంట్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామి దేవాలయం 12 గంటలకే మూత

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీలో వెలిసిన శ్రీ కోనేటిరాయ స్వామి దేవాలయం శనివారం 12 గంటలకే మూతపడడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నిరుత్సాహంతో వెనుదిరిగినట్లు తెలియజేశారు. ఈ ప్రాంతం వారు రెండవ కలియుగ వైకుంఠ దేవాలయంగా నమ్మిన భక్తులు ప్రతి శనివారం తప్పనిసరిగా దేవాలయం చేరుకుంటారు. ఈ నేపథ్యంలో దేవాలయం మూసి వేయడం చూసి అక్కడున్న అధికారులను అడగగా వారు సాయంత్రం నాలుగు గంటల తర్వాత దేవాలయం తెరుస్తామని చెప్పగా భక్తులు సాయంకాలం వరకు ఉండలేక వెనుదిరిగారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ చుట్టుపక్కల మండలాల నుంచి దూర ప్రాంతాల వారు కూడా ఈ దేవాలయానికి వస్తారని సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇక్కడి నుంచి వాహన సౌకర్యాలు కూడా లేవని ఇలాంటి పరిస్థితులలో సాయంత్రం వరకు వేచి ఉండి తిరిగి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. కనుక కనీసం శనివారం రోజు అయినా రోజంతా దేవాలయం తెరిస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దేవాలయాన్ని దినమంతా కొనసాగేలా చూడాలని కోరుతున్నారు.

వడ్డెర కమ్యూనిటీ భవనానికి భూమి కేటాయింపు



ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని తులసి నాయన పల్లి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల సమీపంలో వడ్డెర సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. సుమారు 88 సెంట్లు స్థలం ఈ కమ్యూనిటీ భవనానికి కేటాయించినట్లు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వి పెద్దన్న పాత్రికేయులకు తెలిపారు. చరిత్రలో ఇంతవరకు తమ సామాజిక వర్గానికి ఏ ప్రభుత్వమూ సహాయం చేయలేదని అలాంటిది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మా సామాజిక వర్గాన్ని గుర్తించి రాష్ట్రస్థాయిలో మా వర్గానికి పెద్ద పీట వేశారని అంతేకాకుండా కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించడంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్సీ కెఆర్జె భరత్‌ల కషి శ్లాఘనీయమన్నారు. వారికి రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ తరపున కతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వడ్డెర కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి చదును చేసే కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, వీరభద్రప్ప, ఇతర నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం




ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వడ్లు నూర్పే యంత్రాన్ని ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన చిత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. నగరంలోని సంతపేటకు చెందిన మురుగన్ (47) మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో తన విధులను ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వడ్ల నూర్పిడి యంత్రం అతివేగంగా మురుగన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో మురగన్ తల తెగి ప్రమాదం జరిగిన స్థలానికి నాలుగు మీటర్ల దూరంలో పడింది. నూర్పిడి యంత్రం డ్రైవర్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోవడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మురగన్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం పలువురిని కలిచివేసింది.

చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్



ప్రజాశక్తి-సోమల: సోమల, సదుం, పులిచెర్ల మండలాలలో ఇటీవల గానుగ క్రషర్లు చోరీకి గురయ్యాయని సదుం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు రావడంతో ప్రత్యేక బృందం దీనిపై దృష్టి సారించి అతి తక్కువ సమయంలో క్రషర్ల దొంగలను పట్టుకొని వారి వద్ద నుండి రూ.3.75 లక్షల విలువచేసే క్రషర్లను స్వాధీనం చేసుకున్నట్టు చౌడేపల్లి రూరల్ సిఐ మధుసూదన రెడ్డి, సదుం ఎస్సై మారుతి తెలిపారు. ఆరుగురిని బూరగమంద క్రాస్ వద్ద శనివారం అరెస్టు చేసి, వారి వద్ద ఒక ఆటో స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్టు సిఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం



ప్రజాశక్తి-సోమల: సదుం మండలం పెదకంటి వారి పల్లె గ్రామానికి చెందిన రమణయ్య అనే రైతు పొలం వద్ద గడ్డివామి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన సమీప రైతులు, ప్రజలు గడ్డివామి పూర్తిగా దగ్ధం కాకుండా చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా ఈ ప్రమాదంలో 3000 కట్టల పశుగ్రాసం దగ్ధమైనట్టు రైతు తెలిపారు.

బియ్యం తనిఖీ



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల భోజనాల తయారీకి ఉపయోగించే బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్లాస్టిక్ బియ్యం కాదు విటమిన్లు అని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. గతంలో కూడా ఇలాంటి అనుమానం ఉండగా అధికారులు వాటిని పరీక్షలు చేయించి విటమిన్లతో కూడిన బియ్యమని చెప్పారు. ఇటీవల కాలంలో వారు అంగన్‌వాడీ కేంద్రంలో ఇవి కనపడుతున్నాయని వీటిపై అధికారులు ప్రజలకు అవగాహన కలిగిస్తే ఇలాంటి అనుమానాలు రావని చెబుతున్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం సోదరులు



ప్రజాశక్తి-సోమల: రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముస్లిం సోదరుల హజ్ యాత్రకు ఒక్కొక్కరికి రూ.80 వేలను కేటాయించడం తమకెంతో సంతోషాన్నిచ్చిందని సీఎం జగన్ ప్రభుత్వం ఆ అల్లా దీవెనతో చల్లగా ఉండాలని సదుం మండలంలోని ముస్లిం సోదరులు శనివారం ప్రత్యేక ప్రార్థనలను చేసి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కొక్క ముస్లిం సోదరుడు హజ్ యాత్ర వెళ్లడానికి ఖర్చులకు రూ.80 వేలను ప్రభుత్వం కేటాయించడం వల్ల ఎంతోమంది పేదలు హజ్ యాత్రకు వెళ్లి రావడానికి అవకాశం ఏర్పడిందని, ఏ రాష్ట్రంలోనూ ఇంత నిధులను కేటాయించిన చరిత్ర లేదని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 18 వందల మంది ముస్లిం మైనార్టీలకు రూ.14.51 కోట్ల నిధులను కేటాయించినట్లు వారు తెలిపారు. అనంతరం బస్టాండ్ కూడలిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వాహన కాలుష్యంపై అవగాహన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వాహనాల కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2023ను పురస్కరించుకొని ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ తిరుపతి కార్యాలయం పర్యావరణ ఇంజినీరు నరేంద్రబాబు తెలిపారు. శనివారం తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలను ఆపి వాహన కాలుష్యంను వివరించి ట్రాఫిక్ సిగ్నల్స్ పడిన సందర్భంలో వాహనాల ఇంజిన్ నిలిపేలా వాహనదారులకు చెప్పడం జరిగిందన్నారు. ఇటువంటి చర్యలతో పర్యావరణ కాలుష్యం తగ్గించే అవకాశాలు ఉన్నాయని నరేంద్రబాబు పేర్కొన్నారు. రవాణాశాఖ ఎంవిఐ శ్రీనివాసరావు, యువ కిషోర్, సిబ్బంది, పర్యావరణ సహాయ ఇంజనీర్ మదనమోహన్ రెడ్డి, పివి కిషోర్ రెడ్డి, శశికళ, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.